క్లుప్తంగా

లారీని ఢీకొన్న కారు



రహదారిపై లారీని ఢీకొన్న కారు

నల్లజర్ల: కంకిపాడు నుంచి రాజమహేంద్రవరం మద్యం బాటిల్స్ తీసుకెళుతున్న లారీని శుక్రవారం ఉదయం దూబచర్ల వద్ద ఏలూరు నుంచి కాకినాడ వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా వారిలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పేరెంట్ టీచర్ సమావేశం

గోపాలపురం: గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

డైట్‌లో కళా ఉత్సవ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

నల్లజర్ల: జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు శుక్రవారం దూడవర్ల డైట్ కళాశాలలో నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఐదు ఉన్నత పాఠశాలల నుంచి 19 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. శాస్త్రీయ నృత్యం విభాగంలో తాడేపల్లిగూడెం టీఎస్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఆర్‌పీఎస్ వెంకటేశ్వరి, శాస్త్రీయ సంగీతంలో తణుకు ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఏలూరు పాటి మహతి, బృంద నృత్యాల విభాగంలో ఏలూరు కేజీఎం సీజీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యస్.ఆర్.సుబ్రహ్మణ్యం తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నిడదవోలు అభివృద్ధే లక్ష్యం

నిడదవోలు: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పట్టణంలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగులు వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, తోలేటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణ



కొవ్వూరులో పోటీలకు ఎంపికైన బాలికల జట్టు, గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు

కొవ్వూరు: పట్టణంలో ఎన్టీఆర్ క్రీడాప్రాంగణంలో ఈనెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడాకారుల శిక్షణ శుక్రవారంతో ముగిసిందని క్యాంపు ఇన్‌చార్జి కొయ్యల ప్రసాద్ తెలిపారు. జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాలికల జట్టుకి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. సీనియర్ క్రీడాకారులు పరిమి రాజేష్, కంటిపూడి శివరామకృష్ణ, నాళం సత్యనారాయణ, కోచ్‌లు రాపాక సురేష్, పి.గంగాధర్, పీడీ ఎ.విజయ్‌కుమార్, కె.ఏడుకొండలు క్రీడాకారులు శిక్షణ అందించిన వారిలో ఉన్నారు.

యువకుడికి తీవ్రగాయాలు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన పై శుక్రవారం సాయంత్రం కారు మోటారు సైకిలిస్టు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడు తలకు బలమైన గాయం అయ్యింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని 108లో రాజమ హేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంలో కారణంగా బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సుమారు రెండు కిలో మీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. పట్టణ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ ప్రమాదంలో గాయపడిన యువకుడి వివరాలు తెలియరాలేదు.

మల్లవరం మాజీ సర్పంచ్ కోడూరి రాజేశ్వరి మృతి

చాగల్లు: మల్లవరం గ్రామ మాజీ సర్పంచ్ కోడూరి రాజేశ్వరి అనే సరోజిని (81) శుక్రవారం మృతి చెందారు. రాజేశ్వరి సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధి కృషి చేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కోడలు లక్ష్మిసుభాషిణి ప్రస్తుతం సర్పంచ్‌గా, కుమారుడు కోడూరి కాశీ గంగాధరరావు ఉపసర్పంచ్‌గా ఉన్నారు. రాజేశ్వరి మృతికి స్థానిక నాయకులు, గ్రామప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

పని బంగారం.. బతుకే భారం

- చితికిపోతున్న స్వర్ణకారుల జీవితాలు
- జ్యువెల్లరీ షాపుల రాకతో మాయమవుతున్న చేతి వృత్తులు

నల్లజర్ల: చేసే పని బంగారమే అయినా వారి బతుకులు మాత్రం భారంగా గడుస్తున్నాయి. విలువైన బంగారానికి అద్భుత రూపానిచ్చే కళా నైపుణ్యం వారి సొంతమైనా వారి జీవితాలు మాత్రం అంధకారంలో ఉన్నాయి. అధునాతన యంత్రాలు రాక, కార్పొరేట్ సంస్థలు వ్యాపారంలోకి రావడం స్వర్ణకారులకు కాలక్రమేనా పనులు తగ్గిపోతున్నాయి. రెడిమేడ్ రంగంలో కొత్త కొత్త డిజైన్లతో మగువలను ఆకర్షించే విధంగా నగలు రావడం, జ్యువెల్లరీ షాపుల రాకతో చేతివృత్తులు మాయమవుతున్నాయి. ఒకప్పుడు పదిమందికి పని కల్పించే స్వర్ణకారుడు నేడు పని కోసం ఎదురుచూస్తున్నాడు.

ఆభరణాలే అందం

ఏ ఇంట్లో శుభకార్యం తలపెట్టినా ముందుగా గుర్తుకు వచ్చేది స్వర్ణకారుడే. పెళ్లికూతుర్ని అందంగా అలంకరించాలన్నా, మగువ అందాలను రెట్టింపు చేయాలన్నా బంగారు ఆభరణాలే ప్రధానం. అటువంటి బంగారు ఆభరణాలు తయారు చేయాలంటే దానివెనుక పెద్ద కష్టమే ఉంటుంది. స్వర్ణకారుడు రాత్రనక, పగలనక ఎంతో కష్టపడతాడు. అటువంటి స్వర్ణకారుడు ప్రస్తుతం దుర్భర జీవితాన్ని గడుపుతున్నాడు.

అంతా యంత్రాలమయం

జిల్లా వ్యాప్తంగా 4 వేలకు పైగా స్వర్ణకారుల కుటుంబాలు ఉన్నాయి. కులవృత్తి మీద ఆధారపడి పని చేసేది కేవలం విశ్వ బ్రాహ్మణులే. బంగారం ధరలు పెరగడం ఒక కారణమైతే జ్యువెల్లరీ షాపులు రాకతో ఆభరణం చిన్నదైన, పెద్దదైన అక్కడే కొనుగోలు చేస్తున్నారు. అక్కడ వాయిదాల పద్ధతి ఉండడం కూడా కొనుగోలు దారులకు అనుకూలంగా ఉంది. దీంతో స్వర్ణకారులకు డిమాండ్ తగ్గింది. సర్వం యంత్రాలమయం అవడంతో స్వర్ణకారులకు పని లేకుండా పోయింది. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వీరందరికి వడ్డీ లేని రుణాలు అందించాలని, ఆర్థికంగా ఆదుకొని స్వర్ణకారుల జీవితాలలో వెలుగులు నింపాలని వారు కోరుతున్నారు. వివిధ చేతి వృత్తుల వారికి ఇచ్చిన విధంగా రూ.10వేల ఆర్థిక సాయం తమకు అందించాలని వీరు విజ్ఞప్తి చేస్తున్నారు.



పోతవరంలో బంగారు ఆభరణాలు తయారు చేస్తున్న స్వర్ణకారుడు

పనుల్లేక కష్టపడుతున్నాం..



డిస్కౌంట్ల పేరుతో బంగారు నగలు వ్యాపారం చేసే కార్పొరేట్ సంస్థల రాకతో స్థానికంగా నగలు తయారు చేసే స్వర్ణకారులకు పనుల్లేకుండా పోతోంది. దీంతో జీవనం కష్టమవుతోంది. కళాకారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పని తప్ప ఏ పని చేయలేం. కుటుంబ గడవడం కష్టంగా ఉంది.

–బల్లంకి చిట్టిబాబు, విశ్వబ్రాహ్మణ సంఘం, కార్యదర్శి, పోతినీడుపాలెం

ప్రభుత్వం ఆదుకోవాలి



పనుల్లేక స్వర్ణకారుల జీవితాలు అగమ్యగోచరంగా ఉన్నాయి. జీవనం సాగించడం చాలా కష్టంగా తయారైంది. రెడిమేడ్ దుకాణాలు ఎక్కువయ్యాయి. చిన్న, చిన్న పని వారికి పనులు దొరకడం లేదు. చిన్నప్పటి నుంచి ఇదే పనిపై ఉండడంతో ప్రత్యామ్నాయ పనులకు వెళ్లలేకపోతున్నాం. ప్రభుత్వం వీరి జీవనం గురించి ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవాలి.

–దాసు రామకృష్ణాచార్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు, అనంతపల్లి

కోటసత్తెమ్మను దర్శించుకున్న అధికారులు



తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌ను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ ఆధ్వర్యంలో అశోక్‌కుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అశోక్‌కుమార్‌ను, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌లకు అమ్మవారి చిత్ర పటాలను అందజేసి సత్కారించారు. ఈకార్యక్రమంలో ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, జిల్లా ఏఎస్పీ ఎన్వీ మురళీకృష్ణ, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ తిలక్, ఎస్సైలు శోభన్‌కుమార్, జి.సతీష్, పరమహంస తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సుబ్బారాయుడి కల్యాణం



ప్రక్కిలంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నల్లజర్లలో నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యుని కల్యాణం

తాళ్లపూడి: సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల సందర్భంగా వల్లీ దేవ సేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆలయాల్లో మూడు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేయడంతో విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు.

వైభవంగా కల్యాణం

ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రక్కిలంక విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆలయంలో అర్చకులు కొతవరపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేగేశ్వరపురం, పెద్దేవంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

ఉండ్రాజవరం: స్థానిక వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ, అంకురార్పణం, ధ్వజారోహణం, రాత్రి వేద పండితుల ఆధ్వర్యంలో వల్లిదేవా సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

పెరవలి: కలియుగ దైవం అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి మాస కల్యాణోత్సవం కన్నుల పండువగా శుక్రవారం నిర్వహించారు. పండితులు వేద మంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి కల్యాణాన్ని జరిపించారు.

దేవరపల్లి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహమణ్యేశ్వర స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. రాత్రి 8.30 గంటలకు ప్రారంభమై కల్యాణోత్సవం 11.30 గంటల వరకు జరిగింది. ఆలయ అర్చకులు అఖండ వంశీకృష్ణమూర్తి, పలువురు పండితులు స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత స్వామి వారిని పెండ్లి కుమారుడిగాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరణ చేసి వివాహ వేదికపైకి తీసుకువచ్చి వివాహతంతు ప్రారంభించారు. స్వామివారి కల్యాణానికి పలువురు భక్తులు పట్టు వస్త్రాలు అందజేశారు. భక్తులకు కల్యాణ అక్షితలు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ వేడుక నిర్వహించారు.

గోపాలపురం: వల్లీ సుబ్రహ్మణ్వేరస్వామి షష్ఠి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గోపాలపురం, దొండపూడి, జగన్నాథపురం, చిట్యాల,సాగిపాడు గ్రామాలలో సుబ్రహ్మణ్వేరస్వామి ఆలయాల్లో స్వామివారికి కల్యాణం నిర్వహించారు.

చాగల్లు: స్థానిక సెంటర్లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం శుక్రవారం వేడుకగా జరిగింది. ఉదయం కొడవటి లక్ష్మణరావు సోదరుల ఆధ్వర్యంలోను, రాత్రి ఆళ్ళ వీరవెంకట రామ్మోహనరావు సోదరుల ఆధ్వర్యంలోను కల్యాణం నిర్వహించారు.

నల్లజర్ల: స్థానిక వల్లీదేవ సేన సుబ్రమణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. 14 మంది దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితులు ఆంజనేయ శర్మ పూజాధికాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఉపసర్పంచ్ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో రాత్రి 8 గంటలకు కల్యాణ తంతు జరిగింది.



దేవరపల్లిలో నిర్వహిస్తున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



చాగల్లు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అధికారుల నిర్లక్ష్యంతో మంచినీటికి కరవు

- నిధులు మంజూరై మూడు నెలలు అవుతున్నా పట్టించుకోని అధికారులు
- రెండు రోజులుగా మంచినీరు లేక గ్రామస్తుల ఇబ్బందులు



అన్నవరప్పాడులో మూతపడిన పంచాయతీ ఆర్‌ఓ ప్లాంట్

పెరవలి: అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా నిధులు మంజూరై 3 నెలలు అవుతున్నా నేటికీ కొత్త ఆర్వో ప్లాంటు నిర్మాణ పనులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనివల్ల మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అన్నవరప్పాడులో ఆర్ఓ ప్లాంట్ 12 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ పూర్తిగా పాడైపోయిందని గ్రామ సర్పంచ్ పంత బాలసుందరి ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన మండల పరిషత్ నుంచి రూ.2.20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు మంజూరై 3 నెలలు అవుతున్నా అధికారులు నిర్లక్ష్యం మూలంగా పనులు చేపట్టలేదు. గ్రామస్తులు అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లస్తున్నారే తప్ప పనులు చేయించలేదు. నెల రోజుల నుంచి పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు చెప్పినా ఆయన పట్టించుకోవడంలేదు. గురువారం రాత్రి నుంచి మంచినీళ్లు పూర్తిగా రావడంలేదని అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మంచినీళ్లు లేక అల్లాడిపోతున్నామని స్థానికులు రంగినీడి శంకర్, పి.కిషోర్ తెలిపారు.

ప్రకటన

నిడదవోలు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం అద్దె భవనములోనికి మార్పుట గురించి

మా యొక్క కార్యాలయము గత 30 సంవత్సరముల నుండి మున్సిపాలిటి వారిచే నిర్మించబడిన భవనము నందు ఉండి ఉన్నది. ప్రస్తుతం నిర్మాణం జరుగుచున్న 3 ఆర్మ్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ROB) పనులలో బిల్డింగును తొలగించుటకు గాను నిడదవోలు మున్సిపాలిటి వారు R.O.C.No.933147/2024/A1, ది.30-10-2024 సంగన నోటీసు ఇచ్చియున్నారు. ఆ ప్రకారంగా కార్యాలయమును మార్పు చేయవలసియున్నది. మా యొక్క కార్యాలయమునకు సుమారు 2500 నుండి 3000 చదరపు అడుగులు గల ఆర్.సి.సి. గ్రౌండు ఫ్లోరు కావలసియున్నది. G.O.MS No.37 FINANCE FMU-TR&B) DEPARTMENT Date : 07-03-2016 ప్రకారం చదరపు అడుగుకు రూ.6/-లు చొప్పున అద్దె చెల్లించబడును. అందుకు అంగీకరించిన వారు నిడదవోలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయమునకు వచ్చి సంప్రదించవలెను. ఈ కార్యాలయము నిడదవోలు మున్సిపాలిటి పరిధిలో మాత్రమే మార్చబడును.

ఇట్లు : సబ్ రిజిస్ట్రారు

సబ్ రిజిస్ట్రారు కార్యాలయము, నిడదవోలు, సెల్: 70939 21450

అంబేడ్కర్ స్ఫూర్తిప్రదాత



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, కౌన్సిలర్లు

నిడదవోలు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞానం, క్రమశిక్షణ సమాజహితం గురించి ఆలోచించడం ద్వారానే మన దేశానికి భారతరత్న, రాజ్యాంగ నిర్మాత అయ్యారని ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర అన్నారు. స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చిపేటలో ఉన్న అంబేడ్కర్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో చర్చిపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో లయన్స్ రంగా వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు జేష్ఠ వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ నాయకులు రాంబాబు, రాంగోపాల్ పాల్గొన్నారు.

చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిడదవోలు రూరల్: దేశంలో పేదోడి తలరాతలు మార్చిన దార్శినికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. సమిశ్రగూడెం, తాడిమళ్ల, కోరుమామిడి, పురుషోత్తపల్లి, డి.ముప్పవరం, మునిపల్లి, కాటకోటేశ్వరం, శెట్టిపేట, తాళ్లపాలెం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. సర్పంచ్ బయ్యే రాధారాణి, మానుకొండ చంద్రబాబు, పంతగాని వెంకటేశ్వరరావు, కొయ్యే నాగబాబు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ డి. సువర్ణరాజు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ డి.ఆనంద్ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విక్రమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెరవలి: అంబేడ్కర్ ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. తాళ్లపూడిలో జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. వేగేశ్వరపురం నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో శ్రీ సాయి స్ఫూర్తి హాస్పటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. మలకపల్లి,గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు పాల్గొన్నారు. పెద్దేవం,అన్నదేవరపేట, ప్రక్కిలంక తిరుగుడుమెట్ట తదితర గ్రామాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: వెలగదుర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దమ్మెన్నులో సచివాలయం వద్ద శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల సంధ్యారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దుర్గారావు, సర్వేయర్ జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు మెయిన్‌బజార్, నవోదయ యంగ్‌మేన్ అసోసియేషన్, మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ కవి నేలపూరి రత్నాజీ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. చాగల్లు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోపాలపురం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం వివిద పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గోపాలపురం మండలం పెద్దాపురం ఎంపీయుపీ పాఠశాలలో హెచ్ఎం కాకి పోశియ్య అధ్యక్షతన అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కొవ్వూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, తాళ్లపూడి ఎంపీపీ పోసిరాజు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: ప్రపంచ మేధావి భారత రత్న బాబాసాహెబ్ వర్ధంతిని పట్టణంలో నిర్వ హించారు. నాలుగోవార్డు క్రిస్టియన్‌పేట వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ సీఐ పి.విశ్వం, బొంత శ్యాం రవిప్రకాష్, రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు పెను మాక జయరాజు, సీహెచ్ చిట్టిరాజు, సా ఆనంద్, ఎం.బంగార్రాజు, కన్నెం మురళీ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.



చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు



దేవరపల్లిలోని డిగ్రీ, పీజీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కరస్పాండెంట్ సువర్ణరాజు



కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు